క్లుప్తంగా

శరవేగంగా రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు

సాక్షి ఎఫెక్ట్..

తాండూర్: మండలంలోని రేచిని రోడ్ రైల్వేస్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు వారం రోజులుగా శరవేగంగా సాగుతున్నాయి. రైల్వేస్టేషన్‌లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతుండడంతో ప్రజలకు రైల్వే సేవలు అందుబాటులో లేకుండా పోయాయని ఈ నెల 16న 'రైళ్లు ఆగని రైల్వే స్టేషన్' పేరిట 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన రైల్వే అధికారులు మూడవ లైన్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నారు.

నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలి



ఎరువుల స్టాక్ పరిశీలిస్తున్న సురేఖ

తాండూర్: రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను విక్రయించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ సూచించారు. శుక్రవారం మండలంలోని బాలాజీ ఫర్టిలైజర్, శ్రీరామ మన అగ్రిటెక్ ఫర్టిలైజర్ దుకాణాలను స్థానిక వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాల నిల్వలు, బిల్లు పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. నాసిరకం విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు తప్పనిసరిగా బిల్ రశీదులు తీసుకోవాలని సూచించారు. ఎరువుల అమ్మకాలను పీవోఎస్ మిషన్ ద్వారానే చేపట్టాలని దుకాణదారులను ఆదేశించారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, సిబ్బంది ఉన్నారు.

వర్షాలు కురువాలని పూజలు

జన్నారం: సకాలంలో వర్షాలు కురువాలని శుక్రవారం మండలంలోని దేవునిగూడలో గ్రామ దేవతలకు పూజలు చేశారు. బీసీ సంఘం నాయకులు, రైతులు సామూహికంగా డప్పుచప్పుళ్లతో బోనాలతో ఊరేగింపుగా గ్రామ దేవతలకు పూజలు వనభోజనాలు చేశారు. బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొంతం సత్తన్న, నాయకులు దేవయ్య, మల్లేశ్, బాపు తదితరులు పాల్గొన్నారు.

చెరువు భూమి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

జన్నారం: మండలంలోని రేండ్లగూడలో అల్లం వారి కుంట చెరువు భూమిని కొందరు ఆక్రమించుకొని పంటలు సాగు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకొని చెరువు హద్దులు ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం సీపీఐ మండల కార్యదర్శి దాసరి తిరుపతి, గ్రామస్తులు డీటీ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అల్లం వారి కుంట సర్వే నంబర్ 160, 161లలో 24 ఎకరాల చెరువు శిఖం భూమి ఉందన్నారు. వెంటనే భూసర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు.

'సింగరేణికే గనులు కేటాయించాలి'

శ్రీరాంపూర్: తెలంగాణలోని కొత్త గనులను సింగరేణికే కేటాయించాలని సీపీఎం మండల కార్యదర్శి మిడివెల్లి రాజ్‌కుమార్, నాయకులు గంగాధరచారి, దమ్మల రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం బొగ్గు గనులను వేలం వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు గనిని వేలం వేయడాన్ని ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం ప్రైవేటు సంస్థలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. కార్మికులు పోరాటానికి సిద్ధం కావాలని సూచించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని శివలింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం చిలుముల కృష్ణమూర్తి పదోన్నతి లభించి బదిలీపై వెళ్తున్న సందర్భంగా శుక్రవారం ఉపాధ్యాయులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ పెద్దింటి రాజన్న, కార్యదర్శి సతీశ్, ఉపాధ్యాయుడు సంతోష్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్ స్వరూప పాల్గొన్నారు.

ఆదాయం ఘనం.. అభివృద్ధి శూన్యం

- మధన పోచమ్మ ఆలయ నిర్మాణానికి రూ.40లక్షల నిధులు
- ఏళ్లు గడుస్తున్నా ముందుకు సాగని పనులు
- సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్న భక్తులు



చెన్నూర్ మధన పోచమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

చెన్నూర్: భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్న మధన పోచమ్మ ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఆలయానికి వందలాది ఏళ్ల చరిత్ర ఉన్నా ఆలయ అభివృద్ధిని మాత్రం పట్టించుకోవడం లేదు. అమ్మవారిని కొలిచేందుకు నిత్యం వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. భక్తులు సమర్పించే కానుకల రూపంలో ఆదాయం ఘనంగా సమకూరుతున్నా ఆలయం మాత్రం అభివృద్ధి చెందడం లేదు. దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధీనంలో ఆలయం ఉన్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. భక్తుల నుంచి అన్ని రకాల రుసుములు వసూలు చేస్తున్న అధికారులు భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. దీంతో రోడ్డు పక్కన వంటలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని భక్తులు పేర్కొంటున్నారు. నిత్యం వచ్చే నిధులే కాకుండా ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరైనా నేటికీ పనులు ప్రారంభించలేదు.

భక్తుల తాకిడి..

సుమారు మూడు వందల ఏళ్లకు పైగా ఆలయానికి ప్రాచీన చరిత్ర ఉంది. అమ్మవారి ఆలయంలో అడుగుపెట్టిన భక్తులు కోరిన కోర్కెలు తీరుతాయని వారి నమ్మకం. రోజురోజుకూ ఆలయానికి భక్తుల తాకిడి పెరుగుతోంది. అయినా భక్తులకు ఆలయంలో సౌకర్యాలు కల్పించడం లేదు.

వారానికి మూడు రోజులు..

మధన పోచమ్మ ఆలయంలో ఆది, బుధ, గురువారాల్లో భక్తులు మొక్కులు చెల్లిస్తుంటారు. అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి, భీమారం, జైపూర్, మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి, వరంగల్ జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని సిరొంచ నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తుంటారు. పురాతన ఆలయం కావడంతో భక్తులు వసతులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. కోటపల్లి, వేమనపల్లి ప్రధాన రహదారి పక్కనే ఆలయం ఉండడంతో ఆది, బుధ, గురువారాల్లో ఆలయ ప్రాంగణంలో ఇటు ఆలయానికి వచ్చిన భక్తులు, అటు వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఆలయం అభివృద్ధి కోసం దేవాదాయ ధర్మదాయ శాఖ నుంచి రూ.40 లక్షల నిధులు మంజూరై మూడేళ్లు కావస్తున్నా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. మంజూరైన నిధులతో టెండర్లు నిర్వహించి అధికారులు ఆలయాభివృద్ధికి కృషి చేయాల్సి ఉండగా పట్టించుకోవడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయంలో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని వేడుకుంటున్నారు.



ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ

నెన్నెల: రోజురోజుకు పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని, ఆకతాయిలు వేధిస్తే వెంటనే షీ టీమ్స్‌కు సమాచారం అందించాలని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలోద్దీన్ సూచించారు. సైబర్‌నేరాలు, మహిళలపై జరిగే అఘాయిత్యాలపై శుక్రవారం నెన్నెల కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దన్నారు. ఆన్‌లైన్ లింక్‌లపై క్లిక్ చేయవద్దని, నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. విద్యార్థినులు స్మార్ట్ ఫోన్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. ఎస్సై ప్రసాద్, హెచ్‌సీ సత్యం, స్పెషల్ ఆఫీసర్ కవిత, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ కమిటీలు నియమించాలి



మాట్లాడుతున్న కోండ్ర ఉదయ్ మాదిగ

నస్పూర్: ప్రైవేటు పాఠశాలలో ఫీజు నియంత్రణ కమిటీలను నియమించాలని మాదిగ స్టూడెంట్ ఫోరం జిల్లా ఇన్‌చార్జి కోండ్ర ఉదయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన సీసీసీలోని జిల్లా కార్యాలయంలో నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ప్రతీ పాఠశాలలో పేరెంట్స్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలో కార్పొరేట్ పాఠశాలల ప్రచారాన్ని అరికట్టాలన్నారు. జిల్లా నాయకులు సీపల్లి సౌజన్ మాదిగ, రిషికుమార్ మాదిగ, గోపికృష్ణ మాదిగ, వేల్పుల అజయ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలఅర్బన్: కార్పొరేట్ పాఠశాలల ఫీజు దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ జాతీయ విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో శుక్రవారం మంచిర్యాలలో కార్పొరేట్ పాఠశాలల దిష్టిబొమ్మ దహనం చేశారు. ఫీజులు, పుస్తకాల ధరలపై నియంత్రణ చట్టం చేసి ఫీజుల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. జాతీయ విద్యార్థి సమైక్య జిల్లా బాధ్యులు వంశీ, సురేశ్, బాలాజీ, నరేశ్ పాల్గొన్నారు.

ఘనంగా పీవీ నరసింహారావు జయంతి



మందమర్రిరూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: పట్టణంలోని సీఈఆర్ క్లబ్ సమీపంలో గల చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద దేశ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం నిర్వహించారు. కార్యాలయం ఎదుట పీవీ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దేశ ప్రధానిగా పీవీ తీసుకొచ్చిన సంస్కరణలు నేటి తరానికి ఉపయోగపడుతున్నాయన్నారు.

రామకృష్ణాపూర్: మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నర్సింహారావు 103వ జయంతిని శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, గోపతి రాజయ్య, వొడ్నాల శ్రీనివాస్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలకు జవాబుదారీగా ఉండాలి'



వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం: పోలీసులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని డీసీపీ భాస్కర్ అన్నారు. ఇటీవల మంచిర్యాల డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన శుక్రవారం మంచిర్యాల పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఎస్సైలను, సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో తరుచుగా జరిగే నేరాల వివరాలను సీఐ బన్సీలాల్‌ను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ సరిహద్దులను రూట్ మ్యాప్ ద్వారా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఫిర్యాదుదారుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. డీసీపీతో పాటు స్థానిక ఏసీపీ ప్రకాశ్, సిబ్బంది ఉన్నారు.

పోలీస్ స్టేషన్ల తనిఖీ..

నస్పూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్, నస్పూర్ పోలీస్ స్టేషన్లను డీసీపీ భాస్కర్ ఏసీపీ ప్రకాశ్‌తో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ల పరిసరాలను పరిశీలించారు. ఠాణాల పరిధిలో జరుగుతున్న నేరాలపై ఆరా తీశారు. జనరల్ డైరీ తదితర రికార్డులను పరిశీలించారు. అసాంఘిక కార్యకలాపాలు, మత్తు పదార్థాల నిరోధానికి కృషి చేయాలని సూచించారు. ఠాణాల ఆవరణ పరిశుభ్రత–పచ్చదనంతో వెల్లివిరిసేలా చూడాలన్నారు. వారివెంట మంచిర్యాల రూరల్ సీఐ అశోక్, ఎస్సైలు రవికుమార్, సురేశ్ ఉన్నారు.

సీడ్ డ్రిల్ మిషన్‌తో అధిక దిగుబడి

జన్నారం: ఆయిల్ పాం తోటలో సీడ్ డ్రిల్ మిషన్ ఉపయోగించి వరి ధాన్యం వేసి పంట సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి సంగీత అన్నారు. శుక్రవారం మండలంలోని రేండ్లగూడ గ్రామంలో రైతు అల్లం లచ్చన్న తాను వేసుకున్న 8 ఎకరాల పామాయిల్ తోటలో సీడ్ డ్రిల్ మిషన్ ద్వారా వరి విత్తనాలు వేసే విధానాన్ని పరిశీలించి సూచనలు చేశారు. నూతన విధానం ద్వారా గత ఏడాది లచ్చన్న వరి విత్తనాలు వేసి ఎకరాకు 25 క్వింటాళ్ల పంట దిగుబడి సాధించారన్నారు. ఏవో వెంట ఏఈవో సంధ్య, రైతులు ఉన్నారు.

జాతీయ అవార్డు గ్రహీతకు సన్మానం

కాసిపేట: మండల కేంద్రంలోని కాసిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం కాసిపేటకు చెందిన లక్ష్మణ్‌దాస్ అంబేద్కర్ జాతీయ అవార్డు పొందగా శుక్రవారం అంబేద్కర్ సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. అంబేద్కర్ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు జాడి పోశం, నాయకులు రాజన్న, గోగర్ల శంకర్, మల్లేశ్, మల్లయ్య, స్వామి, రత్నం రాజం, వాసుదేవ్, రాజలింగు పాల్గొన్నారు.

విద్యార్థులకు గొడుగులు పంపిణీ



గొడుగులు అందజేస్తున్న దాతలు

చెన్నూర్: పట్టణంలోని పద్మనగర్ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న 60 మంది విద్యార్థులకు గొడుగులను కాంగ్రెస్ నాయకులు పిట్టల లక్ష్మీభవాని రవీందర్‌లు శుక్రవారం అందజేశారు. వర్షాకాలంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా గొడుగులు అందజేసినట్లు పేర్కొన్నారు. నాయకులు గుండెటి మధుకర్, ఒడ్డెపల్లి రాజేశ్, బాపు, రవి, కిశోర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కొబ్బరికాయల దుకాణం వేలం

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథ ఆలయంలో శుక్రవారం కొబ్బరి కాయల దుకాణం వేలం నిర్వహించినట్లు ఆలయ ఈవో ముక్తా రవి తెలిపారు. పాత రమాదేవి రూ.3,72,000లకు వేలం దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. వేలంలో నిర్వహణ అధికారి బాపిరెడ్డి, ఆలయ ఉద్యోగులు, సిబ్బంది ఠాకూర్ ప్రతాప్‌సింగ్, గోపాల్‌రావు పలువురు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఐటీఐలపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: నిబంధనలు పాటించకుండా అధిక పరీక్ష ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ ఐటీఐలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం మంచిర్యాల ఐటీఐ ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు రూ.213, సప్లిమెంటరీ విద్యార్థులకు రూ.510 ఉండగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు రూ.1500 నుంచి రూ.2000 వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, బాధ్యులు రమేశ్, ప్రశాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఐమాస్ట్ లైట్స్ ప్రారంభం

కోటపల్లి: మండలంలోని ఎసన్‌వాయి గ్రామంలో మండల పరిషత్ నిధుల నుంచి ఏర్పాటు చేయించిన ఐమాస్ట్ లైట్లను శుక్రవారం ఎంపీపీ మంత్రి సురేఖ ప్రారంభించారు. రాత్రిపూట గ్రామస్తులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఐమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ తెలిపారు. మాజీ సర్పంచ్ సీమానాయక్, నాయకులు గోపాల్, బాపు తదితరులు పాల్గొన్నారు.

నేడు తాండూర్ వారసంత వేలం

తాండూర్: తాండూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతీ బుధవారం నిర్వహించే వారసంత వేలం శనివారం నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ ఈవో తపస్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు తాండూర్ ఐబీ వారసంత స్థలంలో వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు వేలం ధరావత్తు రూ.10 వేలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

కాలువ పూడిక తీయించాలి

తాండూర్: మండలంలోని తాండూర్ పెద్ద చెరువు కాలువ పూడికతీత పనులను త్వరితగతిన చేపట్టాలని మండల కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఎంపీటీసీ సిరంగి శంకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహమ్మద్ ఈసాలు మాట్లాడుతూ చెరువు కాలువలో పూడిక పేరుకు పోవడంతో రైతుల పొలాల ఆయకట్టుకు సరిపడా నీరందే పరిస్థితి లేదన్నారు. వరి నాట్లు వేసుకునే సమయం దగ్గర పడుతుందని వెంటనే కాలువ పూడికతీత పనులు చేపట్టి పొలాలకు నీరందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు హర్షద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సహకార సంఘ సమావేశం

కాసిపేట: మండల కేంద్రంలోని ధర్మరావుపేట సహకార సంఘం శనివారం సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు నీల రాంచందర్ తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్లు, సభ్యులు, మండల రైతులు రైతుబంధు పథకంపై రైతు వేదికలో నిర్వహించే స్పెషల్ జనరల్ బాడీ మీటింగ్‌కు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

4న తైబజార్ వేలం

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని తైబజార్, పశువుల సంత ఫీజు వసూలు కోసం శుక్రవారం నిర్వహించాల్సి ఉన్న వేలం తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. వేలాన్ని జూలై 4న మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు 3వ తేదీలోగా పని వేళల్లో రూ.5వేలు చెల్లించి దరఖాస్తు ఫారం పొందాలన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

చెన్నూర్: పట్టణంలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో గర్మిళ్ల లయన్స్‌క్లబ్, రేకుర్తి కంటి ఆసుపత్రుల ఆధ్వర్యంలో సంయుక్తంగా శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో 200 మందికి పరీక్షలు నిర్వహించగా, 40 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వీరిని రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్ తెలిపారు. వైద్యులు భాస్కర్‌రెడ్డి, జాడి తిరుపతి, సామాజిక కార్యకర్తలు రమేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

భీమిని: వెంకటాపూర్ గ్రామంలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో అంబిలపు సుధాకర్ ఇల్లు దగ్ధం కాగా కన్నెపల్లి మండల పీఏసీఎస్ వైస్‌చైర్మన్ ఆకుతోట రాజన్న రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేల, నష్టపరిహారం అందేలా చూస్తానన్నారు.

అభిప్రాయ సేకరణ సమావేశం

వేమనపల్లి: నీల్వాయిలోని రైతువేదికలో ఆదివారం రైతు భరోసా పథకం అమలుపై అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ కుబిడె వెంకటేశం, సీఈవో మచ్చ మధుకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లా డీఆర్ ఏవో రాథోడ్ బిక్కు హాజరుకానున్నారు. సంఘంలో రుణాలు తీసుకున్న రైతులు, సభ్యత్వం ఉన్న వారు, సంఘం డైరెక్టర్లు హాజరు కావాలని సూచించారు.

నేడు సర్వసభ్య సమావేశం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలతో పాటు ఆయా శాఖలకు చెందిన మండల అధికారులు తమ శాఖల తాజా నివేదికలతో హాజరు కావాలన్నారు.

గుడిసెలు తొలగించిన వారిపై కేసులు పెట్టాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకులు

చెన్నూర్‌రూరల్: గుడిసెలను తొలగించిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకులు పైళ్ల ఆశయ్య, మిల్క్ వాసుదేవరెడ్డి అన్నారు. మండలంలోని బావురావుపేట గ్రామ సమీపంలో కూల్చిన గుడిసెలను శుక్రవారం పరిశీలించిన అనంతరం మాట్లాడారు. నిరుపేదలు వేసుకున్న గుడిసెలను కూల్చి వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు లేకపోవడంతో బావురావుపేట సమీపంలో గుడిసెలు వేసుకుంటే కొందరు వాటిని కూల్చివేశారమని మండిపడ్డారు. కలెక్టర్, చెన్నూర్ ఎమ్మెల్యే, తహసీల్దార్, పోలీసులు స్పందించి గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలిచ్చి రక్షణ కల్పించాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, నాయకులు ప్రకాశ్, చందు, రంజిత్‌కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మోహన్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మహేశ్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అభినవ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి, చారి, కరీమా, ఉమారాణి, సమ్మక్క, సరిత, కుమార్, రమాదేవి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు సన్మానం



కార్మికులను సన్మానిస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: ఉద్యోగాలు చేస్తున్న ప్రతీ ఒక్కరికి ఉద్యోగ విరమణ తప్పదని మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య అన్నారు. మంచిర్యాల మున్సిపాలిటీలో పనిచేస్తున్న ముగ్గురు కార్మికులు ఈ నెలాఖరుతో ఉద్యోగ విరమణ చేయనుండగా, వారిని మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఘనంగా సన్మానించారు. ఇంజనీరింగ్ విభాగంలోని తాగునీటి సరఫరాలో పనిచేస్తున్న పెరక ఎల్లయ్య, పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న దర్శనాల శంకర్, కోకిల రాజంలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, వైస్‌చైర్మన్ సల్ల మహేశ్, కౌన్సిలర్లు వేములపల్లి సంజీవ్, శంకర్, ప్రకాశ్ నాయక్, సత్యనారాయణ, బానేశ్, హరికృష్ణ, నరేశ్, చంద్రశేఖర్ హండే, మున్సిపల్ మేనేజర్ విజయ్‌కుమార్, మున్సిపల్ డీఈ మధుకర్, ఏఈలు మధు, రాజేందర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ సునీల్ రాథోడ్ పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టరూ!



నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయం ప్రహరీ శిథిలావస్థకు చేరింది. వర్షానికి శిథిలావస్థలో ఉన్న గోడ తడిసి ఉండడంతో ఎప్పుడు కూలుతుందోనని ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఎస్టీపీపీ జీఎం బసివిరెడ్డికి సన్మానం



సన్మానిస్తున్న బీఎంఎస్ నాయకులు

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు జీఎంగా విధులు నిర్వర్తించిన చిన్న బసివిరెడ్డి ఈ నెలతో పదవీ విరమణ పొందుతుండగా బీఎంఎస్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బీఎంఎస్ యూనియన్ జనరల్ సెక్రటరీ దుస్స భాస్కర్, వైస్ ప్రెసిడెంట్ చిలకాని వెంకటేశ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బోడకుంట శ్రీధర్, జాయింట్ సెక్రెటరీ కల్యాణపు సతీశ్, పాత శివ పదవీ విరమణ పొందుతున్న జీఎం బసివిరెడ్డిని శాలువతో సన్మానించి సత్కరించారు. ఇంతకాలం ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

పదోన్నతి పొందిన ఏఎన్‌ఎంకు..



అపరంజిని సన్మానిస్తున్న సిబ్బంది

జన్నారం: ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తూ హెల్త్ సూపర్‌వైజర్‌గా పదోన్నతి పొందిన అపరంజి దంపతులను శుక్రవారం ప్రభుత్వ వైద్యాధికారి ఉమా శ్రీ, మాజీ సర్పంచ్ జాడి గంగాధర్, సిబ్బంది సన్మానించారు. తపాలాపూర్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. హెల్త్ సూపర్‌వైజర్లు కమలాకర్, సిబ్బంది సందీప్, మాధవి, అంగన్వాడీ టీచర్లు కవిత, శ్రీవాణి, జమున, సంజీవరాణి తదితరులు పాల్గొన్నారు.